క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా : హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిచిపోనుందని ఏఈ బాలునాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్‌పీ–1 బ్రేకర్, అనుముల ఫీడర్ బ్రేకర్ మార్పిడి ఉన్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపేట, పాలెం, అనుముల, అనుములవారి గూడెం, ఈశ్వర్ నగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దూదిపాల శ్రీధర్‌రెడ్డి కోరారు. బుధవారం కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడి మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1200 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల ఎదుట ధర్నా

దేవరకొండ: విద్యార్థిని దండించిన ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవడంతో పాటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని పట్టణంలోని చైతన్య విద్యాలయం ఎదుట బుధవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలు వురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం 5వ తరగతి చదువుతున్న చరణ్‌పై చేయి చేసుకోవడంతో పాఠశాల నుంచి ఎటో వెళ్లిపోయాడని తెలిపారు. విషయం అతడి తల్లిదండ్రులకు తెలియడంతో ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి కృష్ణ, నాగార్జున్, జగన్, నరేష్, సిరాజ్, రాజు, తదితరులున్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ: శ్వాస కోస సంబంధిత వ్యాధులకు కారణమయ్యే కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నాటిన కోనోకార్పస్ చెట్లు పర్యావరణాన్ని దెబ్బతీయడమే కాకుండా ప్రజలకు శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. మున్సిపల్ అధికారులు సాధ్యమైనంత త్వరగా వాటిని తొలగించాన్నారు. వాటి స్థానంలో ప్రకృతి సిద్ధమైన చెట్లను పెంచాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు గుండాల అంజయ్య,వస్కుల సుధాకర్,నేతాళ్ల వెంకటేష్,రెడ్డి శంకర్, వలసాని వెంకన్న, ఇడెం రవి,హరి,అంజి,తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న పులిచర్ల గ్రామస్తులు

పెద్దవూర: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పులిచర్ల గ్రామస్తులు ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఎస్.సరోజ పావనికి బుధవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరబోయిన వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ బొడ్డుపల్లి చిరంజీవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన సిరిశాల రాములమ్మ, దొండ లక్ష్మమ్మలకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జంగలి సైదయ్య, దొండ రామరాజు, సీపీఎం నాయకులు చువ్వ భిక్షం, పర్వతం, యల్లయ్య, వెంకటేశ్వర్లు, హుస్సేన్ ఉన్నారు.

వీధివ్యాపారులకు ఆర్థిక చేయూత

- ఆత్మనిర్భర్ భారత్ స్వనిధి ద్వారా ఆర్థికాభివృద్ధి
- విడతల వారీగా చిరు వ్యాపారులకు రుణం అందజేత


అర్హులైన వీధి వ్యాపారులను గుర్తిస్తున్న మెప్మా అధికారులు(ఫైల్)

దేవరకొండ: పట్టణాల్లో వీధివ్యాపారులకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకం అమలు చేస్తోంది. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మనిర్భర్ భారత్ స్వనిధి పథకం వారికి వరంలా మారింది. వీధి వ్యాపారులు తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లిస్తే కొంత వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకుంటే వీధి వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరనున్నట్లు మెప్మా అధికారులు పేర్కొంటున్నారు.

రుణ లక్ష్యం చేరుకునేందుకు..

మున్సిపాలిటీలో అమలవుతున్న ఆత్మనిర్భర్ భారత్ స్వనిధి పథకాన్ని ఎంతో మంది వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈపథకం ద్వారా రుణాల మంజూరుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఎంతగానో కృషి చేస్తోంది. ఆర్పీలు వీధివ్యాపారులకు పలు విధాలుగా అవగాహన కల్పిస్తూ వారు రుణ లక్ష్యం చేరుకునేందుకు తగిన చర్యలు చేపడుతున్నారు.

సకాలంలో చెల్లిస్తే..

రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అల్పాహార కేంద్రాలు, కూరగాయలు, పండ్లు, దుస్తులు ఇతర నిత్యావసరాలు విక్రయించే వారిని ఈ పథకానికి ఎంపిక చేశారు. స్వనిధి పథకం కింద మొదటి రెండు విడతల్లో బ్యాంకుల ద్వారా వారికి రుణాలు అందించారు. వడ్డీతో సహా మొత్తం 12వాయిదాల్లో తిరిగి చెల్లించిన వారికి మరో విడతలో అదనంగా రుణం అందజేస్తారు. మెప్మా సిబ్బంది, ఆర్పీలు దగ్గరుండి బ్యాంకుల ద్వారా వారికి రుణాలు ఇప్పిస్తారు.

విడతల వారీగా రుణాలు

మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వీధి వ్యాపారులను అధికారులు గతంలోనే గుర్తించారు. వీరికి విడతల వారీగా రుణాలు పంపిణీ చేస్తున్నారు. వారిలో తొలి విడతలో అర్హులైన వారికి రూ.10 వేల మంజూరు చేశారు. అవి తిరిగి సకాలంలో చెల్లించిన వారికి రూ.20 వేల చొప్పున రుణం మంజూరు చేశారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణం తీసుకుని సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు వరకు రుణాలు ఇస్తున్నారు.దేవరకొండ మున్సిపాలిటీల పరిధిలో 256 మంది వీధి వ్యాపారులు మూడో విడత రుణం కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 229 మందికి రుణాలు మంజూరైనట్లు సంబంధిత మెప్మా అధికారులు పేర్కొంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వీధి వ్యాపారులు బ్యాంకుల నుంచి రుణం పొంది ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈపథకం ఎంతగానో దోహద పడుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు విడతల వారీగా రుణం పెంచుతున్నారు. పలువురు వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. ఇలా వాయిదాలను క్రమ పద్ధతిలో చెల్లిస్తున్న వారిలో అర్హులందరికీ రుణాలు ఇవ్వడానికి కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారుల అంతా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి.

– జగమంతు, టీఎంసీ, దేవరకొండ

కార్యాలయాలకు సొంత భవనం నిర్మించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల కేంద్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలని సీపీఎం మాడ్గులపల్లి మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ కోరారు. బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందచేసి ఆయన మాట్లాడారు. మాడ్గులపల్లి నూతన మండలంగా ఏర్పడి 8 సంవత్సరాలైనా ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించకపోవడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి మండల కేంద్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, అగ్రికల్చర్, ఉపాధిహామీ, సంఘబంధం కార్యాలయాలకు సొంత భవనాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సిరెడ్డి, శ్రీకర్, నారాయణరెడ్డి, నాగయ్య, విష్ణు, ఎల్లయ్య, సత్తిరెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

డిండి: సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కనకాచారి కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బొగ్గుల దొనలో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన గ్రామ శాఖ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో కేశవులు, నారయ్య ,ఇద్దయ్య, జంగయ్య, శ్రీను, జహంగీర్, మణెమ్మ పాల్గొన్నారు.

ఇంచార్జ్ ఎంపీడీఓగా రమేష్

నిడమనూరు: నిడమనూరు ఇంచార్జ్ ఎంపీడీఓగా కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీఓగా ఉన్న వెంకటేశం 20 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న రమేష్‌కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ ఎస్.సురేష్


అవగాహన కల్పిస్తున్న సీఐ ధనుంజయ్

డిండి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డిండి రూరల్ సీఐ ఎస్.సురేష్ సూచించారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మాదకద్రవ్య నివారణ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ.రాజుతో కలిసి హాజరయ్యారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఒకసారి గంజాయి తాగితే ఆరు నెలల వరకు శరీరంలోని అవయవాలపై ప్రభావం పడుతుందని, పట్టుబడిన వారికి గాంజా పరీక్ష చేసేందుకు కిట్లు అందుబాటులో ఉందన్నారు. గంజాయి తాగినట్లు తేలితే జైలు శిక్ష ఉంటుందన్నారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉంచేందుకే మిషన్ పరివర్తన కార్యక్రమం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో ఉపధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బానిసలు కావొద్దు

నాగార్జునసాగర్: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని,మాదక ద్రావ్యాలకు బానీసలైతే విద్యకు దూరమవుతారని విజయపురి టుటౌన్ ఎస్ఐ సంపత్ సూచించారు. బుధవారం నందికొండ పైలాన్‌కాలనీలోని ఆదర్శప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎస్ఐ సంపత్,అన్నపూర్ణ సేవాభారతి సభ్యులు శ్రీకాంత్ మాదక ద్రవ్యాలపై,సైబర్ మోసాల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

వేములపల్లి: యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల బారిన పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొర్ర సైదానాయక్, నాయకులు రొండి శ్రీనివాస్, పతాని శ్రీను, పుట్టల సంపత్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అజాద్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, సిపాయి, శివమణి, రాములు, సోమేష్ పాల్గొన్నారు.

పోలీసులు సమాచారం అందించాలి

గుర్రంపోడు : మిషన్ పరివర్తన్ అనే పోగ్రాం ద్వారా డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌లపై జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు డగ్స్, గంజాయి అనర్థాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

‘చలో ఢిల్లీ’ కరపత్రం విడుదల


కరపత్రం విడుదల చేస్తున్న చెన్నయ్య

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8, 9, 10వ తేదీల్లో మాల ప్రజా సంఘాల జెఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య కోరారు. బుధవారం పట్టణంలోని ఎన్ఎస్‌పి క్యాంపులో గల తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ దళితులను చమార్–నాన్ చమార్‌గా విభజించి ఈ దేశాన్ని దీర్ఘకాలికంగా బీజేపీ–ఆర్ఎస్ఎస్ గుప్పిట్లో ఉంచుకోవాలనే లక్ష్యంతో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నాయని ఆరోపించారు. వీరికి మనువాద పార్టీలన్నీ తొడు కలిశాయని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నాయకులు లకుమల్ల మధుబాబు, మాల ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ రమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ, నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, నాగార్జునసాగర్, నల్లగొండ నియోజకవర్గాల అధ్యక్షుడు లకుమాల లింగయ్య, కొయ్య కిరణ్, సామ కోటయ్య, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో ప్రతిభ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ స్కూల్ ప్రీమియర్ లీగ్ 2024 క్రికెట్ టోర్నమెంట్‌లో పట్టణంలోని డౌహిల స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. జట్టు కెప్టెన్ ఇంతియాజ్, టీమ్ సభ్యులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ బాబు కరస్పాండెంట్ సాయి శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ఆసక్తి చూపితే మానసిక, శారీరక దారుఢ్యం కలుగుతుందని కరస్పాండెంట్ సాయి శ్రీనివాస్ అన్నారు.


విజేతలతో పాఠశాల యాజమాన్యం

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని నందిపాడుకు చెందిన పెయింటర్ అంగరాజు అంజిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పెయింటింగ్ సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో అతడి కుటుంబానికి బుధవారం రూ.6 వేలు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, బీఎం నాయుడు, మంద రాజు, గోవర్ధన్‌రెడ్డి, సైదులు తదితరులున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

వేములపల్లి(మాడ్గులపల్లి): గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, దుంపలు ఆహారంగా తీసుకోవాలని సీడీపీఓ చంద్రకళ సూచించారు. బుధవారం మాడ్గులపల్లి మండలంలోని పాములపాడులో గర్భిణులు, ఆశాలకు, అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల తరువాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలను అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ రాము

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సర్వ సాధారణమని అన్నారు. సన్మానం పొందిన వారిలో ఎక్కలూరి సునిత, శశిధర్‌రెడ్డి, ఆవుల మధు, పార్వతమ్మ, నోవా, రాయల్‌కుమారి, మోతీలాల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు భాను, వినయ్‌కుమార్, సరోజిని దేవి, అమృతయ్య పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

హాలియా : అనుముల మండల స్వర్ణకారుల సంఘం నూతన కమిటీ సభ్యులను బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అనుముల మండల అధ్యక్షుడిగా కటకం మురళిచారి, ప్రధానకార్యదర్శిగా వల్లెం ప్రశాంత్‌రెడ్డి, కోశాధికారిగా వంగాల శివకుమార్ చారి, ఉపాధ్యక్షుడిగా మద్దోజు బ్రహ్మాచారితో పాటు మరి కొంతమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు కటకం మురళీచారి మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల కోసం తనవంతుగా కృషి చేయడంతో పాటు సంఘం అభివృద్ధికి తోడ్పాటునందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కన్నెకంటి సైదాచారి ఉన్నారు.

సమాజ సేవలో పాల్గొనాలి


మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

చింతపల్లి : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవలో పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల సైదులు, కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కుర్రంపల్లి ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న పద్మజానాయుడిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గురువారావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జింకల సత్యనారాయణ, ఏడుకొండలు, యూటీఎఫ్ నాయకులు కె.యాదగిరి, శ్రీరాములు, సంపత్, పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ఉద్యోగ విరమణ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండి భిక్షమయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఎఫ్ఏసి ప్రిన్సిపాల్ పరంగి రవితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థినుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల బీసీ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి అల్పాహారాన్ని పరిశీలించారు. అల్పాహారంలో పోషకాలు లేకపోవడంతో సిబ్బంది, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. లేనట్లయితే అట్టి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ జెండా స్థూపాన్ని త్వరగా పూర్తి చేయాలి

78 స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న వంద అడుగుల జాతీయ జెండా స్థూపం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పాత జిమ్ ఏరియాను పూర్తిగా తొలగించి కొత్తగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన బీసీ యువజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలను విస్మరిస్తే గత పాలకులకు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, రాయించు నర్సింహ, మహేశ్వరపు నరేష్, గడేనబోయిన హరి, ఎలిజాల నవీన్, ఉపేందర్ తదితరులున్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కును అందిస్తున్న పోస్టల్ సిబ్బంది

పెద్దవూర: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీపీఎం సైదులు అన్నారు. బుధవారం మండలంలోని వెల్మగూడెం గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో సామాజిక అభివృద్ధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తపాలాశాఖ అందిస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన పొదుపు, జీవిత బీమా, ప్రమాద బీమా, ఆధార్ సర్వీసెస్, కామన్ సర్వీస్ సెంటర్ సేవల గురించి వివరించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి పోస్టాఫీసును కేంద్ర ప్రభుత్వం ఐపీపీబీగా మార్చిందని తెలిపారు. అనంతరం రెండు నెలల క్రితం మృతి చెందిన బొంగరాల రజిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును నామినీ తండ్రి వీరయ్యకు అందించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది అనంత శర్మ, లోకేష్, సందీప్, జానీ, మల్లిక, అశోక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ కుల గణనను చేపట్టిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌లు పెంచకుండా ఎన్నికలను నిర్వహించవద్దని కోరారు.

జిమ్ నిర్మాణ పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల రాజీవ్‌గాంధీ స్టేడియంలో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపులో పాత స్థానంలో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను పూర్తిగా తొలగించి మున్సిపల్ సాధారణ నిధులతో నూతన జిమ్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

బ్యాంకుల వద్ద రైతుల బారులు



తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రైతు రుణమాఫీ చేయడంతో బుధవారం మండలంలోని రైతులు బ్యాంకుల వద్ద బారులుదీరారు. రుణమాఫీ తమకు వర్తించిందా లేదా అనే సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి రైతులు ఒన్ బీ పహాణీ కాపీలతో ఉదయం నుంచే బ్యాంకుల వద్ద బారులుదీరడంతో కిక్కిరిసింది.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆర్థిక సహాయంతో రాజవరం మేజర్ కాలువ పూడిక తీత, కంప చెట్ల తొలగింపు పనులను బుధవారం మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి ప్రారంభించారు. రాజవరం మేజర్ చివరి భూములకు సాగునీరు అందడం లేదన్న విషయాన్ని స్థానిక రైతులు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించినట్లు తెలిపారు. ఈ పూడికతీత పనులతో మేజర్ చివరి భూములకు సాగునీరు అందనుందని తెలిపారు. కార్యక్రమంలో కాంసాని చంద్రశేఖర్, కూన్‌రెడ్డి లింగారెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, పెద్దిరెడ్డి, దుర్గారెడ్డి, శివ, మైసయ్య, జానిమియా, పాండు, బాలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీఓ రేఖ మమత అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు సహకరించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రోత్సహించాలన్నారు.